# బుద్ధిమంతుడు

ప్రిన్సిపల్‌గారు రాగానే పిల్లలంతా లేచి నిలబడ్డారు. అల్లరి సద్దుమణిగింది. అక్కడక్కడ అలవోక గా తచ్చాడుచున్న విద్యార్థులంతా తమ తమ 'సీట్ల'లోకి జొరబడుతున్నారు. 'మానీటరు' హాజరుపట్టీ వేసుకుంటున్నాడు. కాలేజీ విద్యార్థిని సుభద్ర 'ప్రిన్సిపల్'గారి పక్కనే ప్రత్యేకించబడిన 'సీట్లో' పొందికగా కూచుని నోటుబుక్కూ పేనా తెరుస్తోంది.

ఆమె 'క్లాస్‌రూం'లో అడుగుపెట్టడం తరవాయిగా ఒకడు తుమ్మాడు; ఒకడు దగ్గాడు; ఒకడు సకిలించాడు. ఈ వుద్గారాలన్నీ ప్రిన్సిపల్‌గారు లోపలికి రావడంలోనూ, ఆయన రాగానే ఎంతో ఆదరాబాదరాగా లేచినిలవడంలోనూ కలిగిన సందట్లో కొంతవరకూ అయిక్యమైపోయినై. శేషం 'ప్రిన్సిపల్'గారి చెవిదాకా సోకినా ఆయనంతగా పట్టించుకోనూ లేదు. వయసులో ఉన్న ఆడపిల్లల్ని చూడగానే మొగవిద్యార్థులలో పొటమరించే ఆ భావసంచలనమూ, ఆ సంచలనం తాలూకు బాహ్యచిన్హాలుగా రూపొందే కొక్కిరాయి కోణంగిచేష్టల కళాప్రదర్శనమూ ఇవన్నీ ఆయనకు ఇదివరకే పూర్తిగా అవగతమై వున్నాయి. అంచేత అట్లాంటి అసభ్యతనీ, అనౌచితినీ, ఒక హద్దువరకూ తప్పనిసరిగా చూచీచూడనట్టు నటిస్తూ సహించి వూరుకునే మనస్తత్వం ఆయనకి నరాలలో జీర్ణించిపోయి వుంది. మళ్లీ, తెలిసి, ఉపేక్షిస్తున్నట్టుగాని విద్యార్థులకు అనిపిస్తే క్రమశిక్షణ చెడుతుంది. 'ప్రిన్సిపల్'గారంటే విద్యార్థులలో కొంత అలుసు ఏర్పడుతుంది. ఇంతవరకూ ఊరుకోగాలేనిది ఇహ కొంచెం విజృంభిస్తేమటుకు ముంచుకు పోయిందేమున్నదీ అన్న భరోసామీద మామూలు అల్లరి కార్యక్రమానికి మరికొన్ని 'అయిటములు' తగిలిస్తారు.

'ప్రిన్సిపలు'గారు కూచోగానే విద్యార్థులంతా ఒక్కసారిగా కూచున్నారు. ఆ గలభాలో గప్పున ఒక చిన్న పేపరుముక్కల తుఫానులేచింది సుభద్రమ్మ కూచున్న బెంచీదగ్గర. సుభద్రకే తెలియదు ఆ తుఫాను ఏవేపునించి వొచ్చిందీ. ఆమెకి కాలేజీలోకి రాగానే తలవంచుకునే ఖచ్చితమైన అలవాటు ఒకటుంది. అటూ యిటూ చూస్తే ఎవరు ఎట్లా తలవంపులు తెస్తారోనని విపరీతమైన భయమామెకి. దృష్టి పుస్తకాలమీదా, తప్పితే లెక్చరర్ మీదగాని, వుంచి, ఒక నవ్వు సందర్భానికిగాని, ఒక అయోమయ ఘట్టానికిగాని ముఖకవళిక మారకుండా, చెదరకుండా,

ఉగ్గబట్టి, తడిసిన పావురాయిలా, ఆ బెంచీమీద, అట్లా అట్లా వొదిగి వొదిగి కూచుంటుంది పాఠం నడుస్తున్నంతసేపూ. క్లాసులో ఆమె ఒక్కతే విద్యార్థిని పాపం. ఆ తుఫానుకి ఆందోళనగా లేచి, పైట జడమీదనించీ విరిచి, ముందుకు తీసుకుని, రౌద్రంగా నించున్నదామె. రెండు కాయితపు తునకలు ఆమె పైటమీదా 'ప్రిన్సిపల్'గారి వల్లెవాటుమీదా వ్రాలినై. ఆ తుఫాను రేపిన ఆసామీ సంకల్పం కొంతవరకూ సిద్ధించినట్టే. ఇద్దరూ కాగితపు ముక్కల్ని పరిశీలించి చూచుకున్నారు. ప్రతి కాయితం తునకకీ అటు యిటూ "హే ప్రియా?" అని వ్రాసి ఉంది.

వెనకాల బెంచీలమీదనించి నక్కకూతలూ, కుక్కల అరుపులూ, కోతుల కిచకిచలూ, పక్షుల కిలకిలలూ వినిపిస్తున్నాయి. క్షణం సేపు 'క్లాస్‌రూ'మంతా తలుపులు తెరిచిన 'జూ'లా వుంది. అది ఈ నాగరిక యుగంలో ఒక సభ్యమానవకూటంగా ఇంకా తేరుకోలేదు. 'ప్రిన్సిపల్' గారు 'సీరియస్'గా ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులంతా నిశ్శబ్దంగా వున్నారు. అందరికీ తెలుసు ఆ నిక్షేపరాయుడెవరో. కాని ఒక్కరూ మాట్లాడరు. 'ప్రిన్సిపల్'గారు గద్దించి అడుగుతున్నారు, 'ఈ ఆకతాయిచేష్ట ఎవరిదీ', అని. ఆయనకిమాత్రం తెలియదూ? ఎవ్వరూ ముందుకురారనీ – అయినా మొదటి స్టేజిలో అట్లా చురచుర క్లాసంతా కలయజూడడం, ధిమాకీ చెయ్యడమూ, అదొక పరిపాటి, "ఆ కాయితాల దుమారం ఆవిడ బెంచీమీదనించే వచ్చింది సార్", అని ఘట్టిగా అరిచాడొక విద్యార్థి. ప్రియుడు ప్రియురాల్ని "హే ప్రియా" అని సంబోధించవచ్చును; ప్రియురాలు ప్రియుణ్ణి "హే ప్రియా" అనే సంబోధించనూవచ్చుగస్సార్? అని సమర్థించాడొక వ్యాకరణ వేత్త.

క్రియకి ఏమీ తేలలేదు.

కాని ఇదో కొత్త శిల్పం, ఇకిలింపులూ, సకిలింపులూ, 'నిక్‌నేమ్స్' పెట్టడమూ, 'పేపర్ బాల్స్' విసరడమూ ఇవన్నీ పురాతనశ్రేణికి చెందిన అల్లరి బాజాలు. ఈ నవ్యపంథాకి కధానాయకుడు రామం 'పిరియ'డవగానే 'క్లాస్‌రూం' బైట మూజువాణీగా ప్రశంసాపత్రాలు తోటి విద్యార్థులందరి దగ్గరనించీ అందుకుంటున్నాడు.

సుభద్ర కంటతడిబెడుతూ 'హాస్టల్ రూం'లోకి వెళ్లిపోతోంది. అంతా చూచారు. కోలాహలంగా నవ్వుకున్నారు. అది ఒక సింహనాదం కింద లెఖ్ఖ. ఎంత ఘనత! ఇంతమంది యోధానుయోధులు కలిసి ఒక ఆడ కూతురికి అంతలో కన్నీళ్లు తెప్పించగలిగిన ప్రజ్ఞా, ప్రతిభా, సామాన్యమైనవా?

ఆవేళనించీ సుభద్రమ్మ కాలేజీ చదువు మానుకుంది.

రామం ఇట్లాంటి విజయాలు చాలా సాధించాడు. అతను 'క్లాసు'లో అఖండమైన తెలివి కలవాడు. వాడి మేధస్సు చదువుమీద ఎంత నిశితంగా పనిచేస్తుందో అల్లరిలోనూ అంత పదునుగా నడుస్తుంది. అల్లరిలో అనేక రకాలుంటాయి. 'లెక్చరర్ల'ని నిగ్గదీసి గడ్డుప్రశ్నలు వెయ్యడంలోనేమి, తెలుగు 'లెక్చరర్'ని 'సిలబస్'లోవున్న ప్రణయఘట్టం దగ్గర ఆపి తబిశీళ్లు గుచ్చిగుచ్చి అడగడంలోనేమి, 'లెక్చరర్'గారు ఏ 'యానొటేషన్' భట్టీవేసి పాఠం ఏకరువు

పెడుతున్నాడో .ఆరాలుతీసి బైటపెట్టడంలోనేమి, తారు రోడ్లమీద సీమసున్నంతోటీ, సున్నపు గోడలమీద బొగ్గు కణికల తోనూ కాలేజీ విద్యార్థినులకీ కిట్టని లెక్చరర్లకీ ప్రమాదకరమైన సమంధాలు కల్పించడంలోనేమి ఆరితేరిన ఘటం వాడు. కాని ఆడపిల్లల్ని ఏడిపించడాన్ని ఒక లలితకళకింద 'స్పెషలైజ్' చేసాడు రామన్.

రామన్‌కి వయస్సు 24. వాడికింకా పెళ్లీ పెడాకులూ కాలేదు. పెళ్లి అయితే ఇట్లాంటి రోగం వాడికి సంక్రమించకపొయ్యేదే. చదివిన కథలూ, చూసిన సినిమాలూ వాడి తలకెక్కినయ్యేమో లైంగికానుభవం కోసం పొంగులువారే వాడి రక్తాణువుల్లో ఉప్పెన బయలుదేరింది. చదువూ సంధ్యా ఆనకట్టలుగా వేశాడుగాని ఆనకట్టలు దాటి పొర్లిపోతోంది వాడి ఉద్రేకం. కంచెలు వేసుకుని కూచున్న ఈ నాగరిక ప్రపంచంలో వాడి మొగతనం ఇక వెర్రితలలు వెయ్యడం ప్రారంభించింది. పోనీ సందులలోనూ, గల్లీలలోనూ, రూపాయనోట్లని అనుభవంక్రింద మార్చుకునే సాహసమూలేదు వాడికి. తెగింపు ఉన్నవాడికి ఇట్లాంటి అల్లరి దండయాత్రలు నీచంగా అవుపిస్తాయి కూడా. సాహసమున్నవాడు రాజమార్గంగా దాహం తీర్చుకుని మర్యాదస్తుడుగా ఇట్టే చలామణీ అయిపోతుంటాడు. రామం మాత్రం స్త్రీని అల్లరిచేసీ, ఏడిపించీ, తృప్తిపడతాడుగాని, తీరా ప్రమాదవశాత్తూ గాలిపాటున ఏ నంగనాచి అయినా లొంగివచ్చే సూచన అందించిందీ అంటే, హడిలిపోయి గుండెచెదిరి రక్తం నీళ్లుగారి ఒక్క బిగిని తిరోగమనం లంకించుకుంటాడు. అదేమిటో అర్ధంకాని భయమూ అలజడీ గప్పున అవరించు కుంటాయి వాణ్ణి.

రామన్ మొట్టమొదట తన అల్లరి నైపుణ్యాన్ని జానపదరంగంలో ప్రయోగించాడు. కాని ఆదిలోనే గడ్డికోసే ఒక కాపు కన్నె తాలూకున్నూ, గంప ఎత్తించుకొన్న ఒక గొల్లభామ తాలూకున్నూ అయిదువేళ్లూ కుడి చెంపన ఒక సందర్భానా, ఎడమ చెంపని మరొక సన్నివేశం లోనూ చక్రాంకితాలై పోగానే అతనింక ఆ రంగంనించి విరమించుకొన్నాడు. ఇక అల్లరికి జడిసే నాగరికరంగంలోనేగాని తన ప్రావీణ్యం పనికిరాదని తీర్మానించుకున్నాడు.

ఇట్లాంటి కార్యకలాపాలు రాణింపుకి రావాలంటే సహచరబృందం తాలూకూ మద్దతు కొంత ఉండితీరాలి. అప్పుడుగాని 'రంజు'గా వుండదు. త్రాగుడూ, జూదమూ, అల్లరీ, వ్యభిచా రమూ ఇట్లాంటి సుఖానుభవాలకి 'తోడు' ఉంటేనేగాని 'జల్సా' పూర్తి కాదు. రామన్‌కి మూర్తీ, శర్మా, వర్మా వత్తాసు. మూర్తి రామన్‌కి మొట్టమొదట తాళంవేస్తాడు. కాని ప్రారంభోత్సవం రామన్‌కే వొదుల్తాడు. శర్మ వెన్నెముక లేనివాడు. కూడా వుంటూ వాళ్ల చర్యలకి ఎప్పటికప్పుడు హర్షిస్తూ లోలోపల బులుపు తీర్చుకుంటాడు. వర్మ "ఛ అదేం పనిరా" అంటూనే మధ్యమధ్య "వారెవా" అంటూ శ్రుతిమించుతున్నప్పుడు భయం భయంగా వెనక్కి లాగుతూ, అల్లరి ఆగి పోతుందేమో అనిపించినప్పుడు హెచ్చరికలిస్తూ వాళ్ల కూడా కూడా తిరుగుతాడు.

ఈ నలుగురూ ఒక జట్టు.

ప్రతిరోజూ మెయిలు టయిముకల్లా స్టేషన్లో హాజరవుతుంటారు. నలుగురూ ఖుషీగా కిళ్లీలు నములుతూ, సిగరెట్లు సేవిస్తూ, జట్టాపట్టీలు వేసుకుని 'ప్లాట్‌ఫారం' ఆమూలనించి ఈమూలకి నడుస్తుంటారు. ప్రతి పెట్టెలోకీ తొంగిచూస్తారు – ఎవరికోసమో వెతుక్కుంటునట్టు

– పార్సీలనీ, బెంగాలీలనీ, అరవసుందరుల్నీ తిరగేసుకుంటూ – మళ్లీ ఒక్కొక్క సౌందర్యం దగ్గరా చతికిలబడి కూచుంటే మెయిల్ టయిమయిపోతుంది. అంచేత ప్రతి ఒక్కరి విగ్రహం తాలూకూ ముఖ్యమైన భాగాలుమటుకు తీక్షణంగా చూచి గ్రుక్కిళ్లు మింగేసి వెళ్లమార్చుకుంటారు. 'హిగిన్ బాదమ్స్'లో నాజూకైన ఆడంగులెవరైనా పుస్తకాలు బేరమాడుతుంటే చరచర అక్కడ ఇద్దరటూ ఇద్దరిటూ ఒడుపుగా జేరి "మేగజీన్లు" పరామర్శిస్తూ నిల్చుంటారు. "తెగవెతుకుతా వేమిట్రా వెధవా నీకు కావలిసింది 'అభిసారికో' 'చలంకథ'లో అని 'దయలాగు' ప్రారంభిస్తాడు రామన్. ఆ 'దయలాగు' చిలవలతో పలవలతో ముదిరి ఆవిడ వీళ్లవంక వింతమృగాల్ని చూసినట్టు పరకాయించి చూసేదాకా సాగిపోతుంది. ఇక నిష్క్రమించేముందు అర్థవంతమైన ఒక ఛలోక్తి విసిరి ఆవిడవంక కళ్లల్లోకి చురుక్కున చూచి వచ్చేస్తారు.

సినీమా ఆడంగుల గేటుదగ్గర సినీమాట్యూన్లు కూనిరాగాలుగా విసురుతూ తచ్చాడుతారు. బైటకొచ్చే ఆడవాళ్లని ఎగాదిగా కళ్లతో మింగేస్తూ నిలుచుండిపోతారు. అడపాతడపా రామం "మనవాళ్లింకా రారేమిట్రా?" అని యధాలాపంగా అంటూ వుంటాడు – పక్కన నిల్చున్న ఆసామీ లకి తమ ఆడంగులకోసం ఎదురుచూస్తున్నట్టు అనిపించాలిమరి. సాగిపొయ్యే అందాలని రాసుకుని మసులుతూ ఈలపాటలమధ్య కచకుచ జఘన సౌందర్యాది వర్ణనలు చేసుకుంటూ, తిరిగి తిరిగి కొసకి ఆ ప్రవాహంలో ఎవరినో ఒకరిని 'సెలక్ట్' చేసుకుని, ఆవిణ్ణి ఇంటిదాకా పదిలంగా సాగనంపి చక్కాబోతారు. ఇదీ వాళ్ల దినచర్య.

ఉత్సవాలుగాని తిరణాలుగాని వచ్చినయ్యా ఇహ వాళ్లకి చేతినిండా పనే. ఏ గుడి మొగదలలోనో పాతుకుపోయి వచ్చీపోయే స్త్రీ తైర్థికులకి ఎదురు సన్నాహాలు చేస్తూ కూచుంటారు. ఏ బొమ్మలషాపు దగ్గరైనా ఆడంగులు గుమికూడి వుంటే నేరుగా అక్కడికి దారితీస్తారు. ఆ బొమ్మల్ని వాళ్లు పరిశీలిస్తుంటే ఈ బొమ్మల్ని వీళ్లు నాణెం చేస్తుంటారు. దారసిల్లిన స్త్రీకల్లా ఏదో వొక ముద్దుపేరు పెట్టకమానేదిలేదు. పాలపిట్టనీ, పావురాయనీ, బలిసిన టర్కీకోడి అనీ, గౌడిగేదె అనీ, మల్లెపువ్వనీ, మంచుబొట్టనీ, పువ్వుల రథమనీ సినీమాబండి అనీ, జపాన్ చిమ్నీ అనీ, ముందూ వెనకా సమానతూకాలమరినాయనీ, ఇంట్లో తలగడాలెందుకురా అనీ, స్ప్రింగు మంచాల నవసరమనీ, ఒకటేమిటి, అశ్లీలాన్ని మినహాయిస్తే అచ్చు కవిత్వంకింద చెలామణీ కాదగిన ఫణుతులన్నీ దొర్లిపోతాయి వాళ్ల మధ్య, ఎవరేమనుకోనీ.

మర్నాటినించీ కాలేజీ జూబిలీ మహోత్సవాలు, ఇతర కాలేజీల నించీ విద్యార్థులూ, విద్యార్థినులూ, అధ్యాపకులూ అనేకమంది వచ్చారు. ఎగ్జిబిష నొకటి నడుస్తోంది. ఆహ్వానితులైన వుద్యోగులూ, పురప్రముఖులూ తండోపతండాలుగా వస్తున్నారు. స్త్రీలు జట్లుజట్లుగా రకరకాల సింగారాలతో వొస్తున్నారు. విద్యార్థినులు మాత్రం పాపం నిరాడంబరంగానే, కొట్టొచ్చే అలంకారాలజోలికి పోక, నకిలీ సౌందర్యంకన్నా నీటూ, నిర్మలమైన తీరుతీయమూ ప్రధానంగా సూక్ష్మంలో మోక్షం చూచుకుంటూ నడుస్తున్నారు. రామన్, మూర్తీ, శర్మా, వర్మా తిండీతిప్పలూ మానేసారు. అదో పెద్ద పండగాయెను. ఎట్లా తీరుతుందీ?

కొంతసేపు గేటుదగ్గర కొచ్చీపోయే శీతాకోకచిలకల్ని పరామర్శించారు. అక్కడ కూచుంటే

ఒక సుళువుంది - ఏ అందమూ తప్పిపోయేందుకు ఆస్కారంలేదు. కాని క్షణమాత్ర సందర్శనభాగ్యం మినహా, అందాన్ని ఆసాంతమూ కళ్లతో జుర్రుకునే సందర్భం అమిరి చావదు. ఎగ్జిబిషన్‌లో మంగళగిరి పానకాలరాయుడి 'ఇలస్ట్రేషన్' దగ్గర జనం క్రిక్కిరిసిపోతున్నారు. అటు వెడుతూ ఒక అమ్మాయి మూతికి పగిలిన టమాటాతోనూ, ఒక చిన్నదాని వక్షస్సుకి కైలాస శిఖరంతోనూ పోలికలు చెప్పుకుంటున్నారు. ఉన్నట్టుండి "ఒరేయ్ ఆ బంగినపల్లి మామిడిపండుని చూడరా" అని ఆగాడు మూర్తి. ముగ్గురూ అటు చూపులు సారించారు. ఒక విద్యార్థిని గావును ఎర్రగా పుష్టిగా బొద్దుగా వున్నది. నవ్వినప్పుడల్లా బుగ్గలు చొట్టలు పడుతున్నాయి "భలే అందంరో ఏమి నవనవలు ఊరుతోందిరా మొహబింబము" అన్నాడు శర్మ, "దిష్టి తగుల్తుందిరా వెధవన్న - వొంటిజిగా ఇంకా ఎక్కడా ఖర్చుపడినట్టులేదు" అని బలపరిచాడు మూర్తి. "వాసన చూడనట్టి ప్రసవమ్ము..." అని 'కొటేష'నివ్వబోయి కిసుక్కున నవ్వి నాలిక కొరుక్కున్నాడు వర్మ.

తిరిగిచూస్తే రామన్ అక్కడ లేడు. వాడు వొంటరిగా ఏ పిట్ట వెనకాల పడ్డాడో. బంగినపల్లి మామిడిపండు 'బొటానికల్ గార్డెన్స్' కేసి వెడుతోంది. కూడాపడ్డారు ముగ్గురూ. ఆ పోకపోక ఆ అమ్మాయి ఎగ్జిబిషన్ పూర్తిగా చూచిందాకా పహరా యిచ్చి అలిసిసొలిసి ఇళ్లకి పొయ్యారు. రామన్ మళ్లీ అంతు దొరకలేదు.

ప్రొద్దు పొడవగానే రామన్‌ని పక్కమీద వుండగానే పట్టుకున్నారు ముగ్గురూను.

"రామకోటి వుత్సవాలొచ్చినై రా భయ్యా" అన్నాడు మూర్తి.

"ఒరేయి వొంటో బావుల్లేదు నాకు. గల్లంతు చేయకండిరా" అని తలపట్టుకుని కూచున్నాడు రామం.

"అదా కథ? లేకపోతే నిన్న ఆ సివంగి నడకల చిన్నారిని..."

రామన్ ముసుగులోనించి చట్టున బయటపడ్డాడు. "చవట వెధవల్లారా! చదువూ సంధ్యా అఖ్కర్లే?" అని ఒక్క ఉరుమురిమి ముసుకు బిగతన్ని పడుకున్నాడు.

"ఉండి ఉండి హటాత్తుగా నీతిబోధ చేస్తున్నాడేమిటిరోయ్?"

"మనవాడు ఇక బుద్ధిమంతుడై పోతున్నాడులే"

"చివాట్లేమయినా తగిలినయ్యేమిట్రా?"

"ఒకవేళ ఏ ఎత్తుమడమల పాదరక్షలయినా..."

రామన్ జయ్‌మని లేచాడు.

తుర్రుమన్నారు ముగ్గురూ.

మర్నాడు మెయిల్‌కి రాలేదు రామన్. ముగ్గురూ 'ఏమా' అని ఆలోచనలో పడ్డారు. ఆవేళ వాళ్లకంత ఉత్సాహంగా లేదు. కార్యక్రమం అంత రసవంతంగానూ లేదు. ఆడదాన్ని సూటిగా చూడగల గుండెనిబ్బరం ఆ ముగ్గురికీ లేదు. రామన్ 'రింగ్ లీడరు'గా వుండాలి.

ఉంటే, వాడి వెనకాల లొట్టలువేస్తో తిరగాలి. అదీ సరదా వాళ్లకి. పేరు పెట్టగలవాడూ వాడే, ఛలోక్తులు విసరగలవాడూ వాడే, 'డయలాగులు' ఎట్లా మొదలుపెట్టాలో అన్యాపదేశాలతో అమ్మాయిల దృష్టిని ఆకర్షించడ మెట్లాగో వాడికే తెలుసు. వాడు లేకపోతే మజాలేదు.

ముగ్గురూ ఈదురోమంటూ ఇళ్లకు పొయ్యారు.

సాయంత్రం ఆఖరి 'పిరీడ'యిపోయింది. 'థియేటరు'లో తెలుగు సినిమా వెంకటేశ్వర మహాత్యం మొట్టమొదటిరోజు విడుదల కాబోతోంది ఆవేళ, "పల్లెటూరి బొమ్మలు దిగుతాయి వొరేయ్ పోదామా" అన్నాడు మూర్తి. శర్మా, వర్మా 'సై' అంటే 'సై' అన్నారు. రామన్ "నేనురాను" అని తలవంచుకున్నాడు. అదేమిటి? గుంజి గుంజి వదిలిపెట్టారు. రానంటే రానన్నాడు. వీధి మలుపులో ఒక్కసారి వాళ్లను వొదిలించుకుని "అన్నన్నా పాఠాలెన్ని వెనకబడిపోయాయి." అను కుంటూ వొక్కడే ఇంటిదారి పట్టాడు రామన్. వాడు చదువుకోసం తపనపడుతూ అవుపిస్తా అదే మొదటిసారి వాళ్ళకి.

క్రమంగా రామన్‌కి కాలేజీ విద్యార్థినులవంక చిలిపిగా చూసే అలవాటు తగ్గిపోతోంది. ఎవ్వరికీ బోధపడకుండా వొచ్చింది. మూర్తీ, శర్మా, వర్మా ఆడపిల్లలు కనపడగానే వాళ్లవంక కలుషంగా చూట్టంమాని హఠాత్తుగా రామన్‌వంక పరీక్షగా చూస్తున్నారు. వాడు సరేసరి. ఆడగాలి సోకినవైపుకి ఓరగంటనైనా చూడటం తగ్గించుకున్నాడు. ఈ 'పజిల్' విడకుండా వొచ్చిందెవళ్లకీ.

రథోత్సవంనాడు వొంటరిగా గుడికి వేంచేశాడేమోనని తక్కిన ముగ్గురూ 'సి.ఐ.డి' పని చేసారు. రామం ఇంటి దగ్గరనే ఉండి పోయాడు.

ఈ విపరీతమైన మార్పుకి కారణమేమిటా అని మొట్టమొదట మూర్తికి జిజ్ఞాస కలిగింది. "ఇది హటాత్తుగా వొచ్చిన మార్పుగాని క్రమక్రమంగా కలిగిన పరిణామం మాత్రంకాదు" అని వివరించాడు శర్మ. "ఏమో అంతర్వాణి గబుక్కున కూకలేసిందేమో వున్నట్టుండి" అని పూర్వపక్షం చేశాడు వర్మ.

మొత్తానికి ఇదమిద్ధమని ఏమీ తేల్చుకోలేకపోయారు.

కాలేజీలో అందరికీ ఆశ్చర్యంగా వుంది. ఇంతలో ఇంత బుద్ధిమంతుడెట్లాగ అయ్యాడు వీడని.

కాలేజీ విద్యార్థినులకి అంతవరకూ రామం అంటే సింహస్వప్నం. వాడు కాలేజీ విడిచి వెళ్లిన తరువాత, వెళ్లిపోయినట్టు నిష్కర్షగ తెలిసింతరువాత, బిక్కుబిక్కుమంటో ఇళ్లకు బయల్దేరు తారు వాళ్లు, ఏ వీధిలోనైనా రామన్ సైకిలుమీదగాని, నడుస్తోగానీ ఎదురైతే చాలు ఏదో ఆపత్తు మీద పడబోతున్నట్టు చట్టున పక్కవీధిలోకి గెంతి, ఇంచుమించు పరుగు పుచ్చుకుంటారు. అతని అల్లరిని సహించి వూరుకోని విద్యార్థినికి, తిరుగుబాటు చూపిన విద్యార్థినికి, ఎడతెగని ప్రేమలేఖల పరంపర! అందులో మళ్లీ ప్రణయాన్ని అర్థిస్తూ కాదు లేఖ. అదివరకే జరుగుతున్న ఏదో ప్రేమరహస్యాన్ని 'కన్‌టిన్యూ' చేస్తున్నట్టు ఉంటుంది. ఎవరి చేతుల్లోనైనా ఖర్మంచాలక ఆ

ఉత్తరం పడిందో ఇక ఆ అభాగిని భవిష్యత్తంతా చిన్నాభిన్నమై పోవలిసిందే. క్లాసులో సరేసరి అటూ ఇటూ చూసేందుకు వీలులేదు కదా. పాఠం అర్థం కాకపోతే లేచి అడిగి తెలుసుకుందుకు ఆస్కారం లేదుగదా. తక్షణం ఏదో వొక 'నిక్‌నేమ్' పెట్టేస్తాడు రామన్, నామకరణంతో ఊరుకుంటాడా పోనీ, ఆ పేరు ప్రచారంలో పెట్టేస్తాడు చరచర. 'ప్రిన్సిపల్'కి గాని ఏ రిపోర్టయినా వెళ్లినట్టు సూచాయగా అనుమానం సోకిందో, ఇక ఊళ్లో గోడలన్నీ ఖరాబు! ఎవళ్లెవళ్లకి ఎట్లాంటి ఉత్తరాలు వెళ్లగూడదో వెళ్లిపోతాయి.

అట్లాంటి రామన్ మహర్షి అయిపోయి ఊరుకున్నాడు. అసలు స్త్రీ వంక కన్నెత్తి చూడడమే మానుకున్నాడంటే అటు సూర్యుడు ఇటు పొడుస్తున్నట్టు ఉన్నదందరికీ.

ఎప్పుడైనా శర్మ ఎదురై "శ్రీ శుకులవారికి నమోన్నమః" అని పరిగెత్తుకుపోవడం కద్దు.

ఆడపిల్లలందరికీ అదో తమాషాగా వుంది. ఇన్నాళ్లకి వాళ్లు లక్షణంగా ఊపిరిపీల్చు కుంటున్నారు. నిర్భయంగా తిరుగుతున్నారు. పాఠం చెబుతుంటే నిశ్చలంగా లేచి అడిగి సందేహాలు తీర్చుకుంటున్నారు. వాళ్లలోవాళ్లు ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకుంటున్నారు. నదురూ బెదురూ లేకుండా నవ్వుతున్నారు, పేలుతున్నారు. ఇంకా, వాళ్లే రామం వంక ఎగాదిగా చూస్తున్నారు. మళ్లీ రోగం తిరగబెడుతుందేమో చూద్దామని గావును.

ఎంత కవ్వించినా అతగాడు చలించలేదు.

మూర్తీ, శర్మా, వర్మా మీటింగ్ వేసారు కోవెల వెనకాతల మంటపమ్మీద కూచుని. ఈ మార్పుకి కారణమేమిటో ఆరా తీసితీరాలని వొక నిశ్చయానికి వచ్చారు ముగ్గురూ.

మూర్తి ఉపక్రమించాడు. ఒకసారి అప్పలస్వామి చిన్న 'ఉప్పు' అందించాడు. అప్పలస్వామి 'ప్రిన్సిపల్'గారి జవాను. ఆమధ్య ఒకనాడు 'ప్రిన్సిపల్'గారు రామన్‌ని తెగచివాట్లు పెట్టాడట. రామన్ 'డిబార్' కాబోతున్నాడని ఒక సన్న పుకారు పుట్టింది కాలేజీలో. మూర్తి మెల్లిగా 'రైటర్ని' పట్టుకున్నాడు. ఆయన్ని ఒకసారి కాఫీకి తీసికెళ్లి కొంచెం 'కుషామత్' చేసి "రామంగాడిమీద ఏమయినా 'రిపోర్టు' వెళ్లిందా పైకి?" అని చెవిలో అడిగాడు. "ఇందుకా?" అనుకుని కాఫీమూల్యం కళ్లల్లో కొచ్చి తెల్లబోయాడు 'రైటరు', "ఏమో మరి ఆమధ్య సుభద్రమ్మ కాలేజీ మానింతర్వాత 'ప్రిన్సిపల్'గారి కేదో వొక 'రిపోర్టు' వచ్చినట్టుంది. దానిమీద 'డెమి అఫిషల్గా' ప్రిన్సిపల్'గారు 'ఎవరికో' ఒక 'సీలు కవరు' పంపినట్టు గుర్తుమరి. ఆ సందర్భంలోనే 'ప్రిన్సిపలు'గారు రామన్ మీద కేకలు వెయ్యడం జరిగి వుంటుంది బహుశా" అని అస్పష్టమైన కొంత భోగట్టా ఇచ్చి తల గోక్కున్నాడు 'రైటరు'. అద్దదీ పునాది దొరికింది అనుకొని రామన్ దగ్గరికి బయలుదేరాడు మూర్తి. ఎవరో సుభద్రకు వ్రాసివుంటారు రామన్‌గాడే కాయితం తునకల దుమారం లేవదీసిన ప్రబుద్ధుడని. ఆవిడ 'ప్రిన్సిపల్'గారికి సమాచారం తెలియబరచి ఉంటుంది. తక్కింది సులభంగానే ఊహించుకోవచ్చును. ప్రిన్సిపల్గారేమో రామన్‌ని పిలిచి మొహం వాచేటట్టు చివాట్లువేసి "ఇదిగో 'రిపోర్టు' వ్రాస్తున్నా - దీనితో నీ భవిష్యత్తంతా భస్మీపటలమయిపోతుంది" అని బెదరించి వుంటాడు. ఆ దెబ్బతో టక్కున వాడి రోగం కుదిరి వుంటుంది.

రామం తలుపు తెరిచాడు. మూర్తిని కూచోమని "పూజ ముగించుకు వస్తా" అని లోపలికి పోబోతున్నాడు. "పూజా?" అని తెల్లబోయాడు మూర్తి. "అవున్రా దేవీనవరాత్రులు కదూ" అనేసి లోపలికి వెళ్లిపోయాడు రామం. "ఏమిటేమిటి?" అంటూ కూచుండిపోయాడు మూర్తి.

కొంచెంసేపయింతరవాత రామం బైటకొచ్చాడు. ప్రసాదమిచ్చాడు. కొబ్బరికాయ ముక్కలు కరకర నములుత్తూ పిచ్చాపాటీలో పడ్డారు. ఉన్నట్టుండి "ఒరేయ్ ఒకమాట అడుగుతాను చెప్తావా చెప్పవా?" అని నిగ్గదీశాడు మూర్తి.

"అడుగు" అని తలవంచాడు రామన్.

"ప్రిన్సిపల్‌గారు ఆమధ్య నిన్ను దేనికిరా కేకలేస్తా"

"ఎప్పుడు"

"సుభద్ర కాలేజీ మానింది చూశావూ నువ్వొక ఘనకార్యం చేసిం తర్వాత – అప్పుడు"

"ఎందుకని కేకలేశాడనుకుంటున్నావ్రా" ఎదురుప్రశ్న.

"సుభద్రని అల్లరిపెట్టినందుకు నిన్ను 'డిబార్' చేస్తున్నారటగా అవునా?"

పకపక నవ్వుతున్నాడు రామన్.

ఏదో 'మస్కా' వేస్తున్నాడు అని అర్థం చేసుకున్నాడు మూర్తి.

"నేను సుభద్రకి క్షమాపణ వ్రాసి, ఆమెని గుంటూరు కాలేజీలో చేర్పించి వచ్చా... నేను హృదయపూర్వకంగా పశ్చాత్తాపం పడ్డానని ఆమె నమ్మిందికూడా... ఆమె నాకు వ్రాసిన కృతజ్ఞత లివిగో" అని వూచనున్న ఉత్తరం మూర్తిముందు పడేశాడు రామం.

మూర్తి అయోమయంలో పడ్డాడు. "పోన్లే 'డిబారింగు' దాకా పోతోందేమో గొడవ అని భయపడ్డాను అని చల్లగా జారుకున్నాడు. తోవలో శర్మ ఎదురయ్యాడు. "ఏరా ఏమయినా కూపీ తీశావా" అని ప్రశ్నించాడు శర్మ. "చాలా దూరం ఆరాలుతీశా గాని, ఆఖరికి తుస్సుమందిరా" అని తల గోక్కున్నాడు మూర్తి. "నాకో కీలకం దొరికింది రోయ్" అని వూరించాడు శర్మ.

"వాడికి సమంధాలొస్తున్నాయట."

మూర్తి కొంచెంసేపు దీర్ఘంగా ఆలోచించి శర్మ వీపుమీద ఒఖ్ఖ చరుపు చరిచి "భలేవాడవురా దొరికింది మూలకారణం. వీడు ఇట్లాంటి ఆకతాయి అల్లరికుంక అని తెలిస్తే పిల్లనెవడిస్తాడూ" అని వూదాడు మూర్తి. "రైట్ అందుకనే నాలుగురోజులు పెద్దమనిషి అవతారం ఎత్తాడు వాడు. నువ్వింటికి పో... నేను ఈ 'లైన్సు'మీద కొంత 'క్రాస్' చేసి వస్తా అని శర్మ రామం ఇంటివేపు నడిచాడు.

మూర్తి తిన్నగా ఇంటికి వెళ్లిపోయి 'నోట్సు' భట్టీ వేస్తున్నాడు. రామం నాయకత్వం పోయిం తరువాత మూర్తీ, శర్మా, వర్మా చెదిరిపోయారు. ఆనాటినించీ ఆడంగుల వేట ఉమ్మడి

ప్రణాళిక క్రింద జరిగినంత విశృంఖలంగా సాగడంలేదుగానీ వ్యక్తిగతంగా వాళ్ళు అంతగా మారలేదు. చాతనయినంతవరకూ దప్పిక తీర్చుకొంటూనే వున్నారు పాపం.

మూర్తి 'నోట్సు' బట్టీ వేస్తున్నాడు. ఉన్నట్టుండి "అరెరె చివరికి ప్రిన్సిపలుగారు ఎందుకు కేకలేసాడో అడగనేలేదే" అని వేలు కొరుక్కున్నాడు. అంతలో తలుపుతట్టినట్టయి గడియ తీశాడు.

"వొరేయ్ ఏం జరిగిందనుకున్నావూ"

అని లోపలికి దూసుకుపోతున్నాడు శర్మ. మూర్తి వాడి వెనకాలే నడుస్తున్నాడు. ఇద్దరూ 'ఈజీఛెయిర్ల'లో కూచున్నారు. శర్మ ఒకటే నవ్వు లంకించుకున్నాడు.

"ఇదేమి రోగంరో ఏం జరిగిందీ?" అని విస్తుపోయాడు మూర్తి.

గబుక్కున నవ్వు ఆపి, 'టిన్ను'లోనించీ ఒక సిగరెట్టు తీసి "చెప్తా చెప్తా అగ్గిపెట్టె యివ్వరా అని చేయిచాపాడు శర్మ. "వెధవ బెల్లింపూ నువ్వూను చెప్పరా" అని గుంజిగుంజి వదిలిపెట్టాడు మూర్తి. "అబ్బ అబ్బ వుండరా చెప్తానూ భలే తమాషా జరిగిందిలే" అని తాపీగా అగ్గిపుల్ల వెలిగించి సిగరెట్టు ముట్టించి గుప్పుగుప్పున రెండు పీలువులు పీలిచి మళ్లీ నవ్వులో పడబోతూ "మనమనుకున్నవేమీ కాదురా వాడి మార్పుకి కారణం" అని సారాంశం బైటపెట్టాడు సీరియస్‌గా.

అమట్న వాణ్ణి తందానా అనుకున్నాడు మూర్తి.

"నిన్ను విడిచి వెళ్లానా రామన్‌గాడి ఇంటికి, వెళ్లగానే తలుపు తీసాడు. నాకు ప్రసాదం పెట్టాడు. నువ్వూ అందుకున్నావటగా... దేవీ భక్తుడైపోయాడురోయ్ వాడు..."

మూర్తి 'హంటరు' కోసం వెతుకుతున్నాడు.

"చెప్తానుండరాబాబా చెప్తానుండూ... అరి నీ తొందర మాసిపోనూ... ఆపైనా పిచ్చాపాటిలో పడ్డామనుకో. వాణ్ణి 'ప్రిన్సిపలు'గారు కేకలేసాడు ఎందుకో తెలుసా" అన్నాడు శర్మ.

"ఆ – ఎందుకెందుకూ" అని పచార్లు చేస్తున్నవాడల్లా ఆగాడు మూర్తి.

"ఆవేళ ఒక గుక్క తిప్పుకోలేని ప్రశ్న మన 'మేథమేటిక్స్ లెక్చరర్' మీద గుప్పించాట్ట. అట్లాంటి ప్రశ్నలు లోపాయికారీగా ప్రైవేట్‌గా అడగరుట్రా అని కేకలేశాట్ట."

"సరిపోయింది" అని నిట్టూర్చాడు మూర్తి.

"వాడున్నాడు చూసావూ ఆ రామన్‌గాడు భేషైన పాఠం నేర్పాడురా మనకి. ఇదో తమాషా... తనకి తెలీకుండానే మతబోధ చేసాడురా అదీ విశేషం... హారి వాడిఇల్లు వల్లకాదుగానూ ఎంతటి వాడురా..." అంటూ మళ్లీ ఆశ్చర్యార్థకాలలో పడిపోతున్నాడు శర్మ.

మూర్తి ఇక లాభంలేదని నిస్పృహలో పడిపోయాడు.

"ఒరేయ్ వింటున్నావా అయినా మనం ఇన్నాళ్లనించీ ఎంత పాపం చేస్తున్నామో ఇవ్వాళ గుర్తుకొచ్చిందిరా నాకు. ఈ పాపాన్ని ఎట్లా ప్రక్షాళన చేసుకోవాలో నిజంగా బోధపడదు. ఎంత

మంది ఆడంగుల్ని అల్లరిపెట్టామురా మనం. ఎంత మకిలిగా స్త్రీజాతిని చూసాంరా మనం. ఎంత నీచంగా కంటబడిన స్త్రీని వర్ణించుకున్నామురా మనం. స్త్రీ కనబడితే చాలు రాబందుకి మాంసఖండం అగుపించినట్టే ప్రవర్తించాముగదా మనం. మనలో ఏ ఒక్కడయినా ఒరేయ్ ఇది తప్పు" అని వెనక్కిలాగిన వాడున్నాడా. వాడొక రిమార్కు చేస్తే నువ్వొక చెణుకు చెణికావూ? నేనొక ఛలోక్తి వొదిలానూ? మనం చూస్తున్న ప్రతి స్త్రీలోనూ, మనమాడి పోసుకుంటున్న ప్రతి గృహిణిలోనూ ఒక మాతృమూర్తి దాగివున్న సంగతి మరిచిపోయామే. ఒక్క స్త్రీని చూడగానే మనలో ఇన్ని కోతులు గంతులు వెయ్యాల్నా? ఇంత నెత్తురు కలుషం గావాల్నా? అంతగా చూపులు వక్రించనా? నిజంగా ఎంత మహాపాపం చేసామురా మనం. విద్యార్థులుగా మనం అలవరుచుకోవాలిసిన నిగ్రహం గాలికి వొదిలేశామే! దారం తెగిన గాలిపటాలకిమల్లే అచ్చుబోసి విడిచిన ఆబోతులకిమల్లే విచ్చలవిడిగా చెర్లాడామే..."

"అయిందా నీతిబోధ. ఇది నా చదువుల గదిరోయ్. 'టవున్ హాలు'లో ఉపన్యాసవేదిక అనుకుంటున్నావేమో నీ దుంపతెగా... ఇది నీ భాషా, రామన్‌గాడి భాషరా?" అని మూర్తి 'ఈజీచెయిర్లో' నించి మిర్రి మిర్రి చూచాడు.

"వాడు ఒక్క ముక్క అనలేదు. వాడికి జరిగిన ఒక విచిత్రమైన అనుభవాన్నించి మనం నేర్చుకోవాలిసిన పాఠాలివి"

"అచ్చా - కానీ"

"ఆమట్న నన్ను భోజనానికి లేవమన్నాడురా. నేను కొంత నసిగి సరేనన్నాను. ఒరేయ్ వింటున్నావా? నేను లేచే సందున ఒక అమ్మాయి గబుక్కున ఇంట్లోనించీ గదిలోకి వచ్చి, 'అన్నాయ్ భోజనానికి లే' అని వాడికి నీళ్లందించిందిరా. ఆ అమ్మాయి ఎవరనుకున్నావ్ ఆగాడు శర్మ మళ్లీ.

"నీ శ్రాద్ధంలా వుంది. నీ మాటలలోనే అర్థమవుతోంది గదరా రామం చెల్లెలనీ?"

"అదే అదే... ఆ అమ్మాయి ఆనాడు మనం 'ఎగ్జిబిషన్'లో చూసాం గుర్తున్నదా ఎర్రగా బొద్దుగా బంగినపల్లి మామిడిపండులా ఉన్నది చూశావూ... ఎన్ని 'రిమార్కులు' విసిరాము ఆమెమీద? ఎంత జుగుప్సాకరంగా వర్ణించాము ఆమెని వాడిముందు. జ్ఞప్తికి వస్తోందా?... దానితో వాడి బుద్ధి మారింది. నాకు బాగా గుర్తు. ఆనాటినించే వాడు మనతో తిరుగుళ్లు మానాడు. నువ్వూ తీవ్రంగా ఆలోచించు ఒరేయ్... మొన్న వాడి చెల్లెలయింది... ఇవాళ మా అమ్మ కావచ్చు... రేపు నీ భార్య అవుతుంది. నేపోతున్నా. అని గిరుక్కున వెళ్లిపోయాడు శర్మ.

మూర్తి నోరు తెరిచేసాడు.